T/AP/2024/0929/688/1180



G.Rajesh
CMD, INB MEDIA GROUP

# INB TIMES

తెలుగు దినపత్రిక
Telugu Daily News Paper






ప్రచురణ: , తెలంగాణ | సంపుటి : 03 | సంచిక : 258 | ఎడిటర్ : జి.రాజేష్ | ఆదివారం 15 మార్చి 2026 | పేజీలు : 6 | వెల రూ. 4.00



### వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా

## ముందస్తు చర్యలు

- జిల్లా అధికారులు, వైద్యులకు శిక్షణ కార్యక్రమాలు
- కేసుల నమోదుకు అనుగుణంగా సత్వర చర్యలు
- 1.71 కోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం!
- చికిత్సకు ఉప ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్సీల స్థాయి నుంచి సన్నద్ధత
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

2లో

## తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

### అభినందనలు తెలిపిన స్టాలిన, కమల్ హాసన్






## పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించిన పవన్

థింసా నృత్యంతో స్వాగతం పలికిన గిరిజన మహిళలు

పార్టీ ఆవిర్భావం సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

పాడేరు ఐఎన్‌బిటైమ్స్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పర్యటిస్తున్నారు. ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన వెళ్లారు. అనంతరం రోడ్డు పనులు పరిశీలించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంఛార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు

# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం



- ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తాం... అభివృద్ధి చేసి చూపిస్తాం
- గత ప్రభుత్వం నిధుల మళ్లింపే ఏజెన్సీ వెనుకబాటుకు కారణం
- గిరిశిఖర గ్రామాల్లో 18 నెలల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు
- జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచి నీరు అందిస్తాం
- నందిగరువు 'మాట -- మంతి' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మిగతా 2లో

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి
గిరిజన హక్కుల పరిరక్షణెళి ధ్యేయం
గిరిజనులతో మాటామంతి'లో జనసేనాని

పాడేరు/అల్లూరి సీతారామరాజు ఐఎన్‌బిటైమ్స్

కూటమి సర్కారు పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం. మీ కష్టాలు వినడానికి, సమస్యలు తీర్చడానికి, కన్నీరు మీ గడప తొక్కకుండా చూడటానికి మేము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాం. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు. కష్టాలు చెప్పుకోవడానికి అప్పటి ఎమ్మెల్యే దగ్గరకు వెళ్తే మీ ఊరు ఎక్కడుంది? అనే స్థాయి నుంచి మీ సమస్యలు తెలుసుకోవడానికి మొత్తం ప్రభుత్వ యంత్రాంగమే మీ ముందుకు వచ్చేలా పాలనను ప్రక్షాళన చేశామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కష్టపడే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడితే మేం మరింత ఉత్సాహంగా పని చేస్తాం. మీరు సమస్యలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాక ముందే పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటామని చెప్పారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా



## రేవంత్ రెడ్డి తెలంగాణ 'చోటా యోగి'...

### కాంగ్రెస్‌ది బుల్డోజర్ సర్కార్

- ముస్లింల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట -- కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు దగా
- కొండాపూర్ ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

వివరాలు 2లో



## అమరజీవి విగ్రహావిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం వృథా కానివ్వబోమని, ఆంధ్రజాతి కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతోనే పొట్టి శ్రీరాముల స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్ సవిత తెలిపారు.

### నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

తెలంగాణ నుంచి ములుగు జిల్లాకు అవకాశం
కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు





## మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం

ఎయిర్ స్పేస్ మూసివేతతో ఇక్కట్లు
13 అంతర్జాతీయ విమానసర్వీసులు రద్దు
ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రదు

వివరాలు 2లో

## గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు




- కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
- ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం
- బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు




## భారత్‌కు మరో రెండు ఎల్పీజీ నౌకలు

- హర్మూజ్ దాటి భారత్ వైపు రాక
- ఇరాన్ సహకారంతో సురక్షితంగా నౌకాయానం
- వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

2లో

# అమరజీవి విగ్రహావిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు

అమరావతి, భీమోదయం: పొట్టి శ్రీరాముల 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల అమరజీవి కాంస్య విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహ ఏర్పాటు పనులను మంత్రి సవిత శనివారం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు పనులు ఎంతవరకూ వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నానికే విగ్రహాన్ని సిద్ధం చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులకు సూచించారు. అనంతరం స్మృతివనం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభ స్థలి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణకు ప్రజలు భారీ ఎత్తున తరలి రానున్నారని, ఏర్పాట్లలో అలసత్వం చూపొద్దని దిశా నిర్దేశం చేశారు. ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సవిత స్పష్టంచేశారు. సాధారణ, వీఐపీ గ్యాలరీల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు



. ఈ సందర్భంగా పవన్‌కు స్థానిక మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. పవన్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటి చారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం శు భాభినందనలు తెలిపారు. పవన్‌కు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజాజీవితాల్లో భాగం కావడం సంతోషమన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు పాడేరులో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 'అడవితల్లి బాట' పేరిట నిర్మించిన రహదారులను డిప్యూటీ సీఎం పరిశీలించనున్నారు. ఆపై నిర్మాణం పూర్తయిన రహదారులను పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. అనంతరం గిరిజనులతో 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకుని చర్చించనున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

## నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రెష్ సెంటర్ వర్కర్లకు రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని.. తక్కువ వేతనాల కారణంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు.

## భారత్‌కు మరో రెండు ఎల్పీజి నౌకలు

న్యూఢిల్లీ,మార్చి14: భారత్ మరో విజయం సాధించింది. గల్ఫ్ నుంచి రెండు ఇంధన నౌకలను అత్యంత సురక్షితంగా దేశానికి చేరుకునేలా చేసింది. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందన్నారు. గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయని, వాటిలో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని వెల్లడించింది. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం. గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

పాడేరు నియోజకవర్గం, నందిగరువు గ్రామంలో గిరిజనులతో నిర్వహించిన 'మాటా -- మంతి' కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకీ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. 40 గడపలు ఉన్న నందిగరువు గ్రామానికి దాదాపు రూ.2 కోట్లు ఖర్చు చేసి రోడ్డు వేయించాం. గిరిశిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న ఇబ్బందులు చూడలేక, ఏజెన్సీలో డోలీ మోతలు కనిపించకూడదని కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తున్నాము.మీరు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే ఏనాడూ మీ గ్రామానికి రాలేదు. మీ కష్టం వినలేదు. వారి హయాంలో నిధులు మళ్లించారు తప్పితే ఏనాడు కూడా అభివృద్ధి ఊసే ఎత్తలేదు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే గిరిజన గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు వేశాం. గిరిశిఖర ప్రాంతాల్లో వేయాల్సిన రోడ్లు, ఇవ్వాల్సిన నీళ్లు, కట్టించాల్సిన పాఠశాల భవనాలు ఇంకా ఉన్నాయి. రాబోయే కాలంలో నిబద్ధతతో వాటన్నింటినీ పూర్తి చేస్తాం. ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా ఎక్కడా వివక్ష చూపించలేదు.
జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు లక్షలాది మంది మధ్య జరుపుకోవచ్చు. కానీ అరణ్యం మధ్యలో 40 ఇళ్లు మాత్రమే ఉన్న మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవాలని ఇక్కడికి వచ్చాను. ఈ ప్రాంతంలో ఆవిర్భావ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. 70 ఏళ్లుగా రోడ్డు చూడని గ్రామానికి ఈ రోజు రోడ్డు వేయించాం. నేనే స్వయంగా వచ్చి నాణ్యతను పరిశీలించాను. ఇక్కడి ప్రజలు, యువత అండగా నిలబడితే అభివృద్ధి ఎలా ఉంటుందో మేము చేసి చూపిస్తాం. ఈ ప్రాంతంలో కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులు గెలవకపోయినా, మేము ఎక్కడా వివక్ష చూపించలేదు. కూటమి ప్రభుత్వం- మీరు ఓట్లు వేశారా? లేదా అని చూడదు. మీరు బాగుండాలని మాత్రమే పని చేస్తుంది. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి మారుమూల



గిరిశిఖర ప్రాంతాలకు రావాలంటే నాయకులు భయపడుతుంటారు. ప్రజల కోసం పని చేసే నాకు అలాంటి భయాలు లేవు. మీ కోసం ఎలాంటి ప్రాంతానికైనా వస్తాను. గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తాము అన్నారు.
మాటా-మంతి కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమ గ్రామ సమస్యలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని అధికారులతో చర్చించి
పవన్ కళ్యాణ్ వెంటనే పరిష్కరించారు. ఓనూరు ప్రాథమిక పాఠశాలను స్వయంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

చెన్నై,మార్చి14 సాహితీ పురస్కారాల్లో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారానికి 2025వ ఏడాదికిగాను తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు పేరును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ తదితరులు తమ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తేని జిల్లా మేట్టూర్‌లో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం అప్పట్లోనే ఓ మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పని చేస్తున్నప్పుడే 1980లో దర్శక దిగ్గజం భారతీరాజా తెరకెక్కించిన 'నిళల్గళ్' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. కవితలు, నవలలు తదితర సుమారు 40 పుస్తకాలు, సినిమాలో సుమారు 7,500 పాటలు రాశారు. ఇప్పటికే ఆయన సాహిత్య అకాడమీ, సాధన సమ్మాన్, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గేయ రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత ఆయన మాత్రమే. ఉత్తమ గేయ రచయితగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 6 సార్లు పురస్కారాలు అందుకున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఇప్పటికే రాష్ట్రానికి చెందిన అఖిలన్ (1975), జయకాంతన్ (2002) అందుకోవడం గమనార్హం. జ్ఞానపీఠ్ అవార్డుకు



ఎంపికైన వైరముత్తుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలిపారు. 'తన కవితా పటిమతో తమిళ భాషను శాసిస్తున్న 'కవిపేరరసు' (కవి సామ్రాట్) వైరముత్తుకు జ్ఞానపీఠ్ పురస్కారం దక్కింది. ఈ రోజే నేను వైరముత్తును కలిసి మాట్లాడాను. ఆ భేటీ ముగిసిన కొద్దిసేపటికే ఈ తీపి కబురు రావడం ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసింది' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# రేవంత్ రెడ్డి తెలంగాణ 'చోటా యోగి'...



హైదరాబాద్ మార్చి 14శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్ బడా గుండులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని, ఉపవాస దీక్ష ద్వారా పేదవారి ఆకలి బాధ ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని అన్నారు. మనకున్న దానిలో కొంత పేదలకు దానం చేయడం ద్వారా అల్లాహ్ ఆశీస్సులు లభిస్తాయని పేర్కొన్నారు.
'ఉత్తరప్రదేశ్‌లో యోగి బుల్డోజర్ పాలనలాగే తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలన సాగుతోంది. రేవంత్ రెడ్డి తెలంగాణకు 'చోటా యోగి'." -- హరీశ్ రావు మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీటహరీశ్ రావు మాట్లాడుతూ దేశంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ఎప్పటికీ సెక్యులర్ పార్టీగా మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేసిందన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారికంగా ఇఫ్తార్ విందులు నిర్వహించేవారని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలకు అందించే రంజాన్ తోఫా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు.

## గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

అమరావతి, భీమోదయం: రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం (జీవోఎం) నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం విజయవాడ కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్ పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

## వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు

అమరావతి, భీమోదయం: వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఆధారంగా రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 పై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ చర్చించారు. వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయడం, వడ దెబ్బకు గురైతే సదరు లక్షణాలను వెన్వెంటనే గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించడం, ఇలాంటి కేసుల్లో చికిత్స ఎలా అందించాలన్న దానిపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి వస్తున్న సలహాలు, సూచనలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, రాష్ట్రంలోని పరిస్థితులపై వంటి అంశాల గురించి వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, ఆహారభద్రత విభాగం డైరెక్టర్ నీలకంఠ రెడ్డి, ఇతర అధికారులతో మంత్రి చర్చించారు.
అవేర్ ప్లాట్ ఫామ్ ద్వారా రానున్న 4 నుంచి 5 రోజుల్లో వేసవి తీవ్రత ఎలా ఉంటుందన్న సమాచారం తెలుసుకునేవిధంగా ఏర్పాట్లు జరిగాయి. వాతావరణం కేంద్రాల ద్వారా అందే సమాచారం ఆధారంగా ఏ ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉందో గుర్తిస్తారు. ఈ సమాచారం జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులకు అందుబాటులో ఉంటుంది. దీనికి అనుగుణంగా వీరు చర్యలు తీసుకుంటారు.

## మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం

హైదరాబాద్,మార్చి14 మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మన హైదరాబాద్ ప్రయాణికులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రద్దు అయ్యాయి. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమానాలు శనివారం రద్దు అయ్యాయి. మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ఆయా దేశాల ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేశారు. ఇరాన్ - ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడుల వల్ల అంతర్జాతీయ ఎయిర్ ట్రాఫిక్ పూర్తిగా ప్రభావితమైంది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయి. ప్రధానంగా ఈ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు నిలిచిపోయాయి. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇజ్రాయిల్ విమానాలు రద్దు అయ్యాయి. విమానాల రద్దుతో ఎయిర్‌పోర్ట్‌లో వేచి ఉన్న ప్రయాణికులకు అధికారులు కొన్ని కీలక సూచనలు చేశారు. ప్రయాణికులు మీ విమానానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి సంబంధిత
ఎయిర్‌లైన్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. టికెట్ రీ-బుకింగ్ లేదా రీ-రూటింగ్ కోసం ఎయిర్‌లైన్ ప్రతినిధులతో మాట్లాడాలని అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్నాయని... ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందే తమ విమాన సమయాలను ఒకసారి సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

# దళిత అమ్మాయికి మోసం ఎమ్మెల్యే పిఎ అరెస్ట్

జయశంకర్ భూపాలపల్లి,మార్చి14 భూపాలపల్లి ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ దళిత యువతిని ప్రేమపేరుతో మోసం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఓ దళిత అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. చాలాకాలంగా ప్రేమించుకోవడంతో పాటు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఓ పోలీస్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెండ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీలో సైతం శ్రీనివాస్ అమ్మాయితో పెండ్లికి నిరాకరించాడు. దీంతో అతడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు అమ్మాయిని మోసం చేసిన కేసులో రిమాండ్‌కు పంపినట్టు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు.

## 17న రవాణాశాఖ మొబిలిటీ సమ్మిట్

హైదరాబాద్,మార్చి14:రవాణా రంగం అభివృద్ధి, విద్యుత్ వాహనాలు తదితర అంశాలపై చర్చించేందుకు హైదరాబాద్ కేంద్రంగా నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్, ఇతర కీలక అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17న హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌లో 2వ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు.

# ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృతి చేష్టలు

**పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్**
**ఫిర్యాదుతో రంగంలోకి దిగి అరెస్ట్ చేసిన పోలీసులు**

మేడ్చల్ మల్కాజ్‌గిరి,మార్చి14 మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ప్రాంతంలో సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడం లేదనే కోపంతో ఓ యువకుడు, యువతికి ప్రాణాంతకమైన ఎయిడ్స్ సోకిన రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఎక్కించాడు. సినిమా తరహాలో జరిగిన ఈ పైశాచిక ఘటన ఇప్పుడు కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు ఎయిడ్స్ పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. 'నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి' అనే వికృత ఆలోచనతో, తన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# హరీష్ రావును కలిసిన శారదాపీఠం ఉత్తరాధికారి



హైదరాబాద్,మార్చి14:మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వచ్చిన స్వామిజీ.. ఆయనకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం కోకాపేట నియోపోలిస్‌లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19 న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా హరీశ్ రావును స్వామిజీ సాదరంగా ఆహ్వానించారు. శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా హరీశ్ రావు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# మొజ్తబా ఆచూకీ చెబితే.. . 10మిలియన్ డాలర్లు


**రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా**




వాషింగ్టన్,మార్చి14: ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

# ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

**షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్**



దుబయ్,మార్చి14
దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు.విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు.

# ఒక్క అభ్యర్థి కోసం ఎగ్జామ్ సెంటర్

**తీరా పరీక్షకు డుమ్మా కొట్టిన విద్యార్థి**

నాగర్‌కర్నూలు,మార్చి14: సాధారణంగా ఒక్కో పరీక్షా కేంద్రంలో వందలాది మంది ఎగ్జామ్స్ రాస్తుంటారు. కానీ నాగర్‌కర్నూలు జిల్లాలో మాత్రం విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఒక్క విద్యార్థి కోసం ప్రత్యేకంగా ఎగ్జామ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్‌ను నియమించారు. ఎగ్జామ్ సెంటర్‌కు పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా చేసి తీరా ఎగ్జామ్ పెడితే.. ఆ ఒక్క విద్యార్థి ఎగ్జామ్‌కు డుమ్మా కొట్టి అధికారులకు షాకిచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూలు జిల్లాలో బ్రిడ్జి కోర్సుకు సంబంధించి పరీక్షల కోసం ఇటీవల దరఖాస్తులను స్వీకరించారు. కానీ దీనికి పెద్దగా స్పందన రాలేదు. ఇంటర్ పూర్తి చేసుకున్న వరుణ్ సందేశ్ అనే విద్యార్థి ఒక్కడే పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. జనరల్ బ్రిడ్జి కోర్సు మ్యాథమేటిక్స్ పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించాడు. ఒక్కడే విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడని అధికారులు పట్టించుకోకుండా ఉండలేదు. విద్యార్థికి ఆసక్తి ఉందని భావించి, ఆ ఒక్కడి కోసమే జిల్లాలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు
. పరీక్ష నిర్వహణకు ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్‌ను కేటాయించారు. అలాగే పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇంతా చేసినా ఆ ఒక్క విద్యార్థి మాత్రం ఎగ్జామ్‌కు హాజరుకాలేదు. దీంతో పరీక్షా కేంద్రం ఖాళీగా కనిపించింది. ఒక్క విద్యార్థి కోసం చేసిన ఏర్పాట్లు అన్నీ వృథా కావడంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## రాజధానిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు



అమరావతి,మార్చి14:అమరావతిలోని ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ఈ పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అండర్ గ్రౌండ్ వాటర్, స్టామ్ వాటర్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు వేస్తామని తెలిపారు. శనివారం అమరావతిలోని అనంతవరం, నెక్కలు గ్రామసభల్లో మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రసంగించారు. మౌలిక సదుపాయాల కల్పనపై, గ్రామసభల నిర్వహణపై దృష్టిపెట్టామని చెప్పుకొచ్చారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలోని పనుల్లో ప్రస్తుతం 30 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. 2027 జూన్ నాటికి రాజధానిలో 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్డు,1500 కిలోమీటర్ల లేట్ అవుట్ రోడ్లు పూర్తి అవుతాయని వెల్లడించారు. అమరావతిలో శరవేగంగా ఐకానిక్ భవనాల పనులు జరుగుతున్నాయని తెలిపారు.

# తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి

**ఇంట్లో శవం...పరీక్ష హాలులో విద్యార్థి**
**మెదక్ జిల్లాలో కంటతడిపెట్టించిన ఘటన**

మెదక్,మార్చి14 మెదక్ జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామశివారులో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు మృతిచెందారు. నాగరాజుకు శనివారం అంత్యక్రియలు జరగాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని ఆయన కొడుకు ధనుశ్ పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దు:ఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు (45) అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఉసిరికపల్లి గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నాగరాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఇంటి వద్ద తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా, తండ్రి కలలను నిజం చేయాలనే పట్టుదలతో ధనుశ్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నారు. తండ్రిని కోల్పోయిన బాధను గుండెల్లో దాచుకుని, కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతుండగా ధనుశ్ పదోతరగతి పరీక్షకు ఈరోజు హాజరయ్యారు. తండ్రి మరణించినా ధైర్యం కోల్పోకుండా పరీక్షకు హాజరైన ధనుశ్‌ను చూసి గ్రామస్థులు చలించిపోయారు. 'ఎంత కష్టమొచ్చినా చదువును వదల్లేదు' అంటూ ధనుశ్‌ను ఓదార్చారు. అధికారులు, ఉపాధ్యాయులు కూడా ధనుశ్‌కు ధైర్యం చెప్పారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన నాగరాజు.. తన కొడుకును గొప్పగా చదివించాలని కలలు కనేవారని స్థానికులు తెలిపారు. ఆ కల కోసం ధనుశ్ కన్నీటితో పరీక్ష రాయడం..ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

# గుండెపోటుతో ప్రభుత్వ టీచర్ మృతి

**దుఃఖం దిగమింగుకుని కొడుకు పరీక్షకు హాజరు**

యాదగిరిగుట్ట,మార్చి14 తండ్రి మరణించిన బాధలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. చదువుకు ఉన్న విలువ గురించి తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ.. శోకసంద్రంలోనూ పరీక్ష రాసేందుకు వచ్చాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పట్టణంలో జరిగిన ఈ ఘటన అందర్నీ కలిచివేసింది. మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల హర్షవర్ధన్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి కూరెళ్ల ఎల్లయ్య గుండాల మండలం వస్తాకొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అతను గుండెపోటుతో మరణించాడు. మరోవైపు హర్షవర్ధన్‌కు శనివారంపదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీంతో తండ్రి చనిపోయాడన్న బాధలో ఉండి కూడా శోక సంద్రంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. పరీక్ష అయిపోయిన తర్వాత మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెడతాడని కుటుంబసభ్యులు తెలిపారు. శోకసంద్రంలో ఉన్నప్పటికీ పదో తరగతి పరీక్షకు హాజరైన హర్షవర్ధన్‌ను చూసి స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు తండ్రి మరణించిన బాధ, మరోవైపు భవిష్యత్తు కోసం పరీక్ష రాయాల్సిన పరిస్థితి అందర్నీ కలిచివేసింది.

## మరింత దిగజారిన బంగారం ధరలు




న్యూఢిల్లీ,మార్చి14 అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ




ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్ బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు

ఈవెంట్ బద్దలై పోవాలన్న హరీశ్ శంకర్ పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.




# ధురంధర్-2 ప్రీ బుకింగ్స్ జోరు


### ఉస్తాద్‌కు పోటీగా భారీగా టిక్కెట్ల అమ్మకాలు

హైదరాబాద్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ ద రివెంజ్ ' సినిమాకు ఊహించని స్థాయిలో స్పందన లభిస్తోంది. బుక్‌మైషోలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైనప్పటి నుంచి టికెట్ అమ్మకాలు ఏమాత్రం తగ్గకుండా రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయి. బాలీవుడ్ సినిమా అయినప్పటికీ, టాలీవుడ్ టైర్-1 స్టార్ హీరో సినిమా తరహాలో బుకింగ్స్ ట్రెండ్ కనిపించడం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మార్చి 19న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ స్థాయిలో విడుదల కానుంది. నగరంలో ఇప్పటికే ఆ సినిమాకు రిలీజ్ ఫీవర్ నెలకొన్నప్పటికీ, దానికి ముందు రోజు అంటే మార్చి 18న ప్లాన్ చేసిన 'ధురంధర్ 2' ప్రీమియర్ షోలు కూడా భారీ స్పందనను సొంతం చేసుకుంటున్నాయి. ప్రస్తుతం నగరంలోని ప్రముఖ మల్టీప్లెక్స్‌లలో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని ఏఎంబీ సినిమాస్‌లో ప్రీమియర్ షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ అయ్యాయి. అలాగే ప్రసాద్స్ మల్టీప్లెక్స్ లో కూడా బుకింగ్స్ ఫాస్ట్ ఫిల్లింగ్ మోడ్‌లో కొనసాగుతున్నాయి. నగరంలోని మిగతా మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా టికెట్లు వేగంగా అమ్ముడవుతుండటంతో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాకి సంబంధించి కొన్ని అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినిమా రన్‌టైమ్ దాదాపు 3 గంటల 55 నిమిషాలు ఉండటం, ప్రేక్షకులను ఆలోచనలో పడేసే సూచనలు ఉన్నాయని అంటున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఇలాంటి సినిమాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఈ అంశాలు ఏవీ 'ధురంధర్ 2' క్రేజ్‌ను తగ్గించలేకపోయాయి. ప్రస్తుతం కనిపిస్తున్న అడ్వాన్స్ బుకింగ్స్‌ను చూస్తే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కంటెంట్‌పై ఉన్న హైప్ కారణంగా ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ప్రీమియర్ షోలకే ఈ స్థాయి స్పందన లభిస్తే, విడుదల తర్వాత సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే వీకెండ్

# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

### పెళ్లి పీటలు ఎక్కనుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం



'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.